
# చిట్టిపాట

**– వసుంధర**



**చిట్టి ఒకటో క్లాసు చదువుతోంది. దానికి పాటలు పాడాలని సరదా ! తనకు నచ్చిన ప్రతి పాటనూ శ్రద్ధగా విని నేర్చుకుని పాడుతూంటుంది. దాని పాటలు విని తల్లిదండ్రు లెంతో మురిసిపోతుంటారు.**

ఒకసారి బడిలో పాటల పోటీ లయ్యాయి. అందులో చిట్టికి మూడో బహుమతి కూడా రాలేదు. దానికి చాలా కోపం వచ్చింది. అక్కడేం చేయలేక ఇంటికొచ్చాక ఏడ్చింది.

"పోటీలో నీ కన్యాయం జరిగింది. నువ్వు చాలా బాగా పాడుతావు. నీ పాట విన్నప్పుడు నేను వంట సగంలో మానేసి వచ్చేస్తాను. నీకు తెలుసు కదా !" అంది తల్లి.

ఈ విషయం చిట్టికి తెలియదు. అందుకని అది ఆశ్చర్యపోయి "నిజమా నాన్నా?" అని తండ్రి వంక చూసింది.

తండ్రి నిజమని చెప్పడమేకాక, "నువ్వు పాట పాడితే నేను కూడా పేపరు చదువుతున్నా, బట్టలు మార్చుకుంటున్నా, స్నానం చేస్తున్నా సగంలో వదిలేసి వచ్చేస్తాను" అన్నాడు.

"మరి నా కెప్పుడూ తెలియలేదే?" అంది చిట్టి ఆశ్చర్యానందాలలో మునిగి తేలుతూ.

"పాట పాడుతున్నప్పుడు నీకు ఒళ్లు తెలియదు. నువ్వు త్యాగరాజు, తాన్‌సేన్ అంత గొప్పదానివి. వాళ్లు పాట పాడేటప్పుడు అందులోనే మునిగిపోతారు. పరిసరాలు తెలియవు. నీకూ అంతే !" అన్నాడు తండ్రి.

త్యాగరాజులా పాడడం ఇష్టమే కానీ పాటలో మునిగిపోవడం చిట్టికి నచ్చలేదు. పరిసరాలు తెలియకపోతే పాట పాడిన ఆనంద మేముంటుంది? అందుకని అది ఒళ్లు తెలిసేలా జాగ్రత్తపడి ఆ విషయం తల్లిదండ్రులకు చెప్పి తనొక పాట పాడిం దొక రోజు. అప్పుడు తల్లిసగంలో వంట వదిలేసి వచ్చింది. తండ్రి స్నానం మధ్యలో వచ్చేశాడు. చిట్టికి కలిగిన ఆనందమింతా అంతా కాదు.

ఒక రోజున చిట్టి ఈ విషయం మొదటి బహుమతి వచ్చిన గీతకు చెప్పింది. గీత ఆశ్చర్యపడి తనూ ఇంట్లో అలానే పాడింది. కానీ తల్లిదండ్రులు దాన్ని వేళకాని వేళలో పాటలేమిటని తిట్టారు.

గీత ఇందు కెంతో నిరుత్సాహపడి రోజూ సంగీతం నేర్పడానికి వచ్చే టీచర్ కీ విషయం చెప్పుకుని బాధపడింది. ఆయన అసలు విషయం తెలుసుకుని, "అందరు తల్లిదండ్రులకూ సంగీత జ్ఞాన ముండదు. నేను చెబుతున్నానుగా నువ్వు చాలా బాగా పాడతావు" అన్నాడు.

ఈ విషయం గీత చిట్టికి చెప్పింది క్లాసులో. "ఎంచక్కా మీ అమ్మా నాన్నలకు సంగీతజ్ఞాన ముండి ను వ్వెలా పాడినా మెచ్చుకుంటారు" అని అసూయపడినట్లుగా నటిస్తూ తన గొప్పతనాన్ని ప్రకటించుకుంది.

అప్పుడు చిట్టికి గీత ఎందుకు బాగా పాడుతుందో అర్థమైంది. అదింటికి వెళ్లి తనకూ సంగీతం టీచర్ని పెట్టమంది. తల్లిదండ్రులు గీత టీచర్నే చిట్టికీ కుదిర్చారు.

చిట్టి టీచరుతో — "మేష్టారూ ! వచ్చే సంగీతం పోటీల్లో నాకే మొదటి బహుమతి రావాలి" అని చెప్పింది.

"నా ప్రయత్నం నేను చేస్తాను. నీ ప్రయత్నం నువ్వు చెయ్యి" అన్నాడు సంగీతం టీచరు.

మళ్లీ పోటీ లయ్యాయి. మళ్లీ గీతకే మొదటి బహుమతి వచ్చింది. చిట్టికి ఏ బహుమతీ రాలేదు. మళ్లీ చిట్టి ఇంటికెళ్లి ఏడ్చింది.

"ఆ సంగీతం టీచరుకు గీతంటేనే ఇష్టం. దానికి బాగా నేర్పాడు. నీకు నేర్పలేదు. ఇక నువ్వాయన దగ్గర నేర్చుకోకు" అంది తల్లి.

"ఆ పోటీలో నీకు అన్యాయం జరిగింది. మీకు జడ్జిగా ఉన్నాయన నాకు తెలుసు. ఆయనోసారి ఇంటికి పిలుస్తానుండు" అన్నాడు తండ్రి.

నాలుగు రోజుల తర్వాత పాటల జడ్జి వాళ్లింటికి వచ్చాడు. తల్లిదండ్రులు చిట్టి బాధను ఆయనకు చేరవేశారు. ఆయన చిట్టి నోసారి పాట పాడమన్నాడు. అది పాట పాడుతూంటే ముగ్గురూ పరవశంగా విన్నారు.

"ఎంత బాగా పాడావమ్మా !" అని మెచ్చుకున్నాడు జడ్జి.

"పోటీలో ఇంకా బాగా పాడాను. గీత అసహ్యంగా పాడింది. అయినా దానికి మొదటి బహుమతి నిచ్చారు. నాకు మూడో స్థానం కూడా రాలేదు" అని చెప్పింది చిట్టి.

జడ్జి బాధగా నిట్టూర్చి — "చాలా సారీ చిట్టీ! తేడా అంతా అక్కడి కుర్చీలో ఉంది. అక్కడ కూర్చుంటే అన్యాయమే చేయా లనిపిస్తుంది" అన్నాడు.

"మరి నాకు న్యాయం జరగాలంటే నే నేం చేయాలి?" ఇదీ చిట్టి బాధ.

"బయట న్యాయం లేదు. పదవిలోకి వచ్చిన నాయకులు, ఆస్పత్రుల్లో డాక్టర్లు, కోర్టుల్లో న్యాయమూర్తులు, స్టేషన్లో పోలీసులు, ఆఫీసుల్లో ప్రభుత్వోద్యోగులు అందరూ అన్యాయాలే చేస్తున్నారు. ఈ అన్యాయాలన్నీ పోయేదాకా నీకూ న్యాయం జరగదు కాబట్టి, ఇప్పట్నించీ నువ్వు అన్యాయం గురించి ఆలోచిస్తూ వాటిని పోగొట్టే ఉపాయాలు వెతుకు. ఆ తర్వాతనే బయట పోటీల్లో పాడు" అన్నాడు జడ్జి.

"మరి నేను సంగీతానికి న్యాయం చేయొద్దా?" అంది చిట్టి ఆరిందాలా.

"నేను హామీ ఇస్తున్నాను. నువ్వు పోటీల్లో బహుమతి తెచ్చుకోవాలన్న కోరికను చంపుకుంటే సంగీతానికి న్యాయమే జరుగుతుంది. అన్యాయం జరగదు" అన్నాడు జడ్జి.

చిట్టికి అర్థంకాలేదు. కానీ తల్లిదండ్రులు నవ్వారని తను నవ్వి, "నాకు పాటలు పాడాలని సరదా అంకుల్!" అంది కాస్త బాధగా.

"దాని కేముంది? ఇంట్లోనే పాడుకో" అన్నాడు జడ్జి.

కొన్నాళ్లు చిట్టి అలాగే చేసింది. అప్పుడు తల్లిదండ్రులు విసిగిపోయి — "నీ పాటలతో మా ప్రాణాలు తీస్తున్నావు. మా పనులన్నీ పాడుచేస్తున్నావు. ఇక పాడావంటే నోటికి టేపు వేస్తాం" అన్నారు.

చిట్టికి కోపం రాలేదు. ఏడుపు రాలేదు. భారంగా నిట్టూర్చి, "అన్యాయం బయటే కాదు. మా ఇంట్లో కూడా పాకిపోయింది" అనుకుంది.

ఆ తర్వాత వాళ్లింటి కో రోజున చిట్టి బాబాయి వచ్చాడు. అతడు పౌరహక్కులకు సంబంధించిన ప్రభుత్వోద్యోగంలో ఉన్నారు. చిట్టి బాధను విన్నాక — "అన్యాయాల గురించి భారత పౌరు లందరూ నీ స్థాయిలోనే ఆలోచిస్తున్నారు. ఎటొచ్చీ వాళ్లకు ఓటుంది. నీకు లేదు. కాబట్టి నీ మాటకు విలువలేదు" అన్నా డతడు.

"వాళ్లలాగే ఆలోచిస్తున్నప్పుడు నాకూ ఓ టెందు కివ్వరు?" అంది బట్టి.

"ఇది ఆలోచించాల్సిన విషయమే. ఇప్పటికి ఓటు హక్కును పద్దెనిమిదేళ్ల దాకా దింపాం. ఇంకా దింపాలి మరి. ఎందుకంటే భారత పౌరులకూ, నీకూ వయసులో తప్ప — తేడా లేదు" అన్నాడు బాబాయి.

ఈ మాటలు చిట్టికి ఉపశమనం కలిగించాయి. ఎందుకంటే ఆమె కిప్పుడు ఇంటా, బయటా కూడా పాటలు పాడే అవకాశం లేదు !

## ఏనుగు పగ

ఖళీకనీ అనే ఊళ్లో విక్రమ్ వహీధర్ అనే వ్యక్తి తన పంట పొలాలను పాడుచేస్తున్న ఒక ఏనుగుపై కాల్పులు జరిపాడు. అది ప్రాణాలు దక్కించుకుని పారిపోయింది. ఆ సంఘటన జరిగి పదేళ్లు గడిచినా సదరు ఏనుగుగారు మాత్రం ఏటా బోలంగీర్ మీదుగా ఆ ఊరు వచ్చి విక్రమ్ వహీధర్ ఇంటిపై దాడి చేసి ప్రహారీగోడ కూలుస్తోంది. పైగా ఆ ఊళ్లో ఇద్దరు వ్యక్తులు దాని కోపానికి ప్రాణాలే వదిలారు. ఇప్పుడు ఖళీకనీ గ్రామస్థులు నేరగాడిని శిక్షించండంటూ కలెక్టర్ గారి ఆఫీసు ముందు నిరాహార దీక్షబూని కూర్చున్నారు.

## బాలీవుడ్ బాణీ

### జూహీ—జైలకు పెళ్లంట!

ఇది కూడా మరో పెళ్లి వార్తే! మల్టీ మిలియనర్, ప్రముఖ పారిశ్రామికవేత్త జై—మెహతాతో నవ్వుల సుందరి జూహీ చావ్లా రహస్యంగా మూడు ముళ్లు వేయించుకుం దనే పుకారు ప్రస్తుతం షికారు చేస్తున్నది. ఈ జంట ఇటీవల విదేశాలకు వెళ్లింది హనీమూన్ కోసమే నని చెబుతున్నారు. హనీమూన్‌కు వెళ్లేముందు సంప్రదాయం తప్పకూడదని పెళ్లి చేసుకున్నదని, వచ్చే దీపావళినాటికి తమ పెళ్లిపై ఆధికారికంగా ఒక ప్రకటన చేస్తారని అనుకుంటున్నారు. ఏది నిజమో, ఏది అబద్ధమో! ఇంకో ఏడాదిలోగా ఎన్నెన్ని మార్పు లొస్తాయో!

మసూద్ అన్సారి

